క్లుప్తంగా

ఎరువుల దుకాణాల తనిఖీ



తనిఖీ చేస్తున్న డీఏవో శ్రీనివాస్

తిమ్మాపూర్: మండలంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి బి.శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. స్టాక్‌రిజిస్టర్, స్టాక్‌బోర్డు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ పాస్ మిషన్ ద్వారా మాత్రమే రైతులకు ఎరువులు విక్రయించాలని సూచించారు. ఎరువులు బ్లాక్ చేసినా, ఎక్కువ ధరకు అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వీరభద్రస్వామికి వెండి కిరీటం



కిరీటం అందిస్తున్న రఘుపతి, కుటుంబ సభ్యులు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామానికి చెందిన తుమ్మ రఘుపతి కుటుంబ సభ్యులు గ్రామంలోని వీరభద్రస్వామికి కిలో వెండి కిరీటం తయారు చేయించి బుధవారం ఆలయానికి బహూకరించారు. వీరభ్రదస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా కిరీటంతో స్వామివారిని అలంకరించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం ప్రేమ్‌సాగర్

రామడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రేమ్‌సాగర్, పీడీ రమేశ్, టీచర్లు శైలజ, శిరీషా, అరుణ, జ్యోతి, మంజుల , సర్వర్, దేవేందర్, రాజేందర్, భీమయ్య పాల్గొన్నారు.

ఏసీపీకి సన్మానం



ఏసీపీని సన్మానిస్తున్న సత్యంగౌడ్

హుజూరాబాద్: పట్టణ శివారులోని ఏసీపీ కార్యాలయంలో హుజూరాబాద్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌జీని నాగుల సత్యంగౌడ్ బుధవారం కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం సత్యంగౌడ్ రచించిన కవిత సంకలనాన్ని ఏసీపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఖమ్మం ప్రొఫెసర్ డాక్టర్ తడికమల్ల శేఖర్, స్వామి, రామచంద్రం, వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారులో ఉన్న మోడల్ స్కూల్ పదోతరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బుధవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోల రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన



పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీనివాస్, రజనీకర్

జమ్మికుంట: సోషల్ వెల్ఫేర్ సొసైటీ కరీంనగర్ రీజినల్ కోఆర్డినేటర్ లక్ష్మాంజలి విధుల్లో భాగంగా పట్టణంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలుర పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల వసతులు, బోధన విషయాలను అడిగి తెలుసుకున్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ దూడపాక శ్రీనివాస్, కోశాధికారి రజనీకర్ పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘పల్లె వెలుగు’ వస్తలేదు

- బస్సులను ఎరగని గ్రామాలు అధికం
- గన్నేరువరం మండల ప్రయాణికులు, విద్యార్థులకు తప్పని పాట్లు
- ఆటోలు, ఇతర వాహనాలే దిక్కు



జంగపల్లి పాఠశాలకు నడుచుకుంటూ వెళుతున్న విద్యార్థులు

గన్నేరువరం: మండలంలోని శివారు ప్రాంతాలు మినహా మిగతా గ్రామాలకు గతంలో ఆర్టీసీ బస్సు సౌకార్యం ఉండేది. కానీ నేడు ప్రధాన రహదారులు వెంట గ్రామాలకు సైతం బస్సు సౌకార్యం కరువైంది. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయాణికులు, స్కూళ్లు, కాలేజీలకు వెళ్లడానికి విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. ఆటోలు, ద్విచక్ర, ఇతర వాహనాల్లో ప్రయాణం సాగిస్తున్నారు. ముఖ్యంగా రహదారులు ఉన్నా బస్సు సౌకార్యం లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఉచిత బస్సుప్రయాణానికి మహిళలు దూరమవుతున్నారు.గన్నేరువరం మండలంలో 16 గ్రామ పంచాయతీలుండగా అందులో 8 శివారు పల్లెలు ఉన్నాయి. గుండ్లపల్లి, గునుకులకొండాపూర్, గుండ్లపల్లితో పాటు గన్నేరువరం, చొక్కారావుపల్లె, ఖాసీంపేట, మైలారం, పారువెల్లకు మాత్రం ఆర్టీసీ బస్సుసౌకర్యం ఉండగా... మిగతా గ్రామాలకు ప్రధాన రహదారి ఉన్నా బస్సు సౌకార్యం సున్నా. ఇందులో ముఖ్యంగా జంగపల్లి, మాదాపూర్, హన్మజిపల్లె, గోపాల్‌పూర్, పీచుపల్లి, చాకలివానిపల్లె, పంతుళ్ల కొండాపూర్ గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు కరువయ్యాయి. యాస్వాడ, సాంబయ్యపల్లె గ్రామాల పరిస్థితి మరి అధ్వానం బస్సు కోసం కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం సమీప గ్రామం యాస్వాడ ప్రజలు బస్సు కోసం నాలుగు కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని అంటున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం గ్రామాలకు అందనద్రాక్షగా మిగిలింది.

కిలోమీటర్ల మేర నడవాల్సిందే

మండలంలో గన్నేరువరం, జంగపల్లి ఎక్స్‌రోడ్డులో జెడ్పీహెచ్ఎస్ పాఠశాలున్నాయి. ఉన్నత విద్యను అభ్యసించేందుకు గన్నేరువరం పాఠశాలకు ఖాసీంపేట, పారువెల్ల, మైలారం, సాంబయ్యపల్లె, చాకలివానిపల్లె, యాస్వాడ, చొక్కారావుపల్లె గ్రామాల విద్యార్థులు, జంగపల్లి ఎక్స్‌రోడ్డులోని పాఠశాలకు హన్మజిపల్లె, గోపాల్‌పూర్, జంగపల్లి, మాదాపూర్, పీచుపల్లి, గుండ్లపల్లి, గునుకులకొండాపూర్, చీమలకుంటపల్లె గ్రామాలకు చెందిన విద్యార్థుల వెళ్లుతుంటారు. కానీ జంగపల్లి పాఠశాలకు ఆయా గ్రామాల నుంచి బస్సు సౌకార్యం లేక ఆటోలు, సైకిళ్లు, కాలినడకన విద్యార్థులు వెళ్లుతున్నారు. గుండపల్లి, గునుకులకొండాపూర్, చీమలకుంటపల్లె గ్రామాలకు విద్యార్థులు వెళ్లడానికి ఐదు నుంచి ఏడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు, వేసవిలో పాఠశాలకు వెళ్లడానికి పడరాని పాట్లు పడాల్సి వస్తోందని అంటున్నారు.

కళాశాలల విద్యార్థులది మరోతీరు

మండలంలో ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో ఉన్నత విద్య కోసం విద్యార్థులు బెజ్జంకి, కరీంనగర్‌లోని ప్రైవేట్ విద్యా సంస్థలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల విద్యార్థులు గుండ్లపల్లి స్టేజీ వద్దకు వివిధ వాహనాల్లో చేరుకుని కళాశాలలకు వెళ్లుతున్నారు. తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలపై గుండ్లపల్లి స్టేజీ వద్ద దింపడంతో అక్కడి నుంచి బస్సుల్లో కరీంనగర్ వెళ్లి చదువుకుంటున్నారు. మండలంలోని గుండ్లపల్లి స్టేజీ దగ్గరలో మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ఉంది. పిల్లలను చూడటానికి వచ్చే తల్లిదండ్రులు ఇక్కట్లు పడుతున్నారు.

ఆటో లేదంటే నడవాలి



జంగపల్లి ఎక్స్ రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఆటో లేదా నడుచుకుంటూ వెళ్తున్నా. మరి కొందరు విద్యార్థులు సైకిళ్లపై వస్తున్నారు. వర్షా కాలంలో ఆటోలు, సైకిళ్లపై పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అలాగే వేసవిలో ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నాం. కరీంనగర్ నుంచి గుండ్లపల్లి, జంగపల్లి మీదుగా గన్నేరువరం వరకు ఆర్టీసి బస్సు సౌకార్యం కల్పిస్తే విద్యార్థులకు అనుకూలం.

– అభిరామ్, 10వ తరగతి, జంగపల్లి

ఇబ్బంది పడుతున్నారు



మండలానికి సమీపంలో ఉన్నా యాస్వాడ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకార్యం లేక ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఆటోలు కూడా లేవు, దీంతో ద్విచక్రవాహనాలు లేదంటే కాలినడకన వెళ్లాల్సిందే. రహదారి సౌకార్యం ఉంది, ఆర్టీసీ అధికారులు స్పందించి వెంటనే గ్రామానికి బస్సు రూట్ ఏర్పాటు చేయాలి. మహిళలు ఉచిత ప్రయాణానికి నోచుకోవడం లేదు.

– సోమిరెడ్డి రాజిరెడ్డి, రైతు, యాస్వాడ

బస్సులు నడపాలి



కరీంనగర్ నుంచి గుండ్లపల్లి, గన్నేరువరం మీదుగా రాజన్న సిరిసిల్లా జిల్లా వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ కరీంనగర్ ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం ఇచ్చాం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణానికి 9 గ్రామాల మహిళలు నోచుకోవడం లేదని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు విన్నవించాం. బస్సు సౌకర్యం ప్రవేశపెడితే విద్యార్థులు, మహిళలు, ప్రజలకు వ్యయప్రయాస తప్పుతుంది.

– సంపతి ఉదయ్, మాదాపూర్

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సీనియర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంతోపాటు మల్బార్ గోల్డ్‌వారి స్కాలర్‌షిప్ చెక్కు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులను ఉన్నతస్థాయిలో తీర్చి దిద్దడానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మలబార్ గోల్డ్ తరుపున అందజేసిన రూ.1.28 లక్షల చెక్కును కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రమీల, మలబార్ గోల్డ్ ప్రతినిధి విజయ్‌కుమార్, అధ్యాపకులు సత్యనారాయణరెడ్డి, గీతావాణి, నిత్య, రాజమహేందర్ రెడ్డి, మహేశ్వర్, సురేశ్, ఇందిరా, రాజ్‌కుమార్, రాజు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

రామడుగు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సత్యం లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం ధ్యేయంగా పని చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో రాజేశ్వరి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు శుక్రుద్దీన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతి, జిల్లా మహిళ అధ్యక్షురాలు సత్యప్రసన్న, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆయా జీవీల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 61 ఏళ్లు పైబడిన 3,797 మంది వీఆర్ఏల వారసులకు త్వరగా నియామక ఉత్తర్వులు ఇప్పించాలని కోరుతూ, రామడుగు మండల వీఆర్ఏల వారసులు మండల కేంద్రంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి వినతిపత్రం అందజేశారు.

కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని అస్తవ్యస్తం చేస్తోంది



హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌక్ సమీపంలో బుధవారం రాత్రి అఖిల భారత విద్యార్థుల సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని భారత్ బచావో రాష్ట్ర నాయకులు ఆవిష్కరించారు. 25,26వ తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే అఖిల భారత విద్యార్థుల సదస్సుకు రచయితలు, కవులు, మేధావులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ సర్కారు విద్యారంగాన్ని అస్తవ్యస్తం చేస్తుందని, నూతన జాతీయ విద్యా విధానంపై కేంద్ర ప్రభుత్వానికి నిరసనను తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు శ్రావణ్, హుజురాబాద్ జిల్లా జేఏసీ కన్వీనర్ సదానందం,సైదాపూర్ మాజీ ఎంపీపీ వెంకట రాజు, నాయకులు తదితరులు ఉన్నారు.

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని జనతాదళ్ (సెక్యులర్) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు అన్నారు. పట్టణంలో బుధవారం మాట్లాడుదారు. ఏళ్లుగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో నిరుద్యోగులు నిరాశకు లోనవుతన్నారని, కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయడంతోపాటు వయోపరిమితి పెంచాలని కోరారు. సమావేశంలో నాయకులు సందేల వెంకన్న, తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎర్ర కుమార్, ఎస్ఎస్‌బీఎం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి సమ్మయ్య, మహ్మద్ రియాజ్, మొలుగురి కొమురయ్య, నాయకులు తునికి మధుకర్, ముద్దమల్ల శంకర్, ఆకునూరి అచ్యుత్, శ్రీరాముల వెంకటేశ్, మటిక సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో విద్యార్థుల ప్రతిభ



అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాస్

చొప్పదండి: భారతీయ గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి గణితం, సైన్స్ టాలెంట్ టెస్టులో మండల కేంద్రానికి చెందిన వీణాధరి స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థి కూన సాత్విక్ రాష్ట్రస్థాయిలో నాల్గో ర్యాంకు సాధించాడు. మూడో తరగతి విద్యార్థులు అనుమాండ్ల నైనీషా, జాతరగొండ సాక్షిత్ జిల్లా స్థాయిలో రెండు, మూడు ర్యాంకులు సాధించారు. రంజిత్ కుమార్, సంతోష్, శ్రేయాన్స్ కన్సోలేషన్ బహుతులు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించగా మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ్ అందించారు. ఈ మేరకు పాఠశాల కరస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్సై రమేశ్

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అక్షర పాఠశాల విద్యార్థులు నల్గొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 11న ఎస్ఎస్ కరాటే జిమ్నాస్టిక్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో 9వ రాష్ట్రస్థాయి జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీల్లో పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఎస్. రమేశ్‌గౌడ్ అభినందించారు. పోటీల్లో ఐదుగురు విద్యార్థులు గోల్డ్, నలుగురు సిల్వర్, ముగ్గురు బ్రాంజ్ మెడల్స్, ఏడుగురు పార్టిస్పేషన్ సర్టిఫికెట్స్ సాధించారని స్కూల్ కరస్పాండెంట్ మినుకుల మునీందర్, ప్రధానోపాధ్యాయురాలు మినుకుల రాధ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరాటే మాస్టర్ సుంకె రాజు, పాల్గొన్నారు.

నిధులు మంజూరు

రామడుగు: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఎంపీ నిధులు రూ. 27 లక్షలు మంజూరు చేశారని బీజేపీ మండల అధ్యక్షులు ఒంటెల కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గోపాల్‌రావుపేట పీహెచ్‌సీ అంబులెన్స్, జాతీయ జెండా, హైమాస్ట్ లైట్‌లకు, తదితరవాటి కోసం నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు.

మంత్రి చొరవతో సాగునీరు



కాలువల్లో ప్రవహిస్తున్న నీరు

సైదాపూర్: మండలంలోని గుజ్జులపల్లి, జాగీర్‌పల్లి గ్రామాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో కాలువల ద్వారా సాగునీరు వస్తోందని రైతులు బుధవారం ఆనందం వ్యక్తం చేశారు. మండలంలోని పలు గ్రామాలకు మిడ్‌మానేర్ కుడి కాలువ ద్వారా సాగునీరు రావడంలేదని రెండు రోజుల క్రితం రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో ఆందోళన చేశారు. సమస్యను పత్రికల ద్వారా తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే నీరివ్వాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. మర్నాడే కాలువల్లోకి మానేర్ నీరు వచ్చిందని జాగీర్‌పల్లి, గుజ్జులపల్లి రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి పొన్నంకు వినతి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న అలోక్

శంకరపట్నం: ఆటో కార్మికులను ఆదుకోవాలని కేశవపట్నంకు చెందిన ఆటో డ్రైవర్ గొడిశాల సదానందం కుమారుడు అలోక్ బుధవారం కరీంనగర్‌లో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు ఇబ్బందులుపడుతున్నారని, సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీ పంచాయతీ పరిధిలోని ఉపజ్ఞ హోమ్స్‌కు మిషన్ భగీరథ నీరు అందించనున్నామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రకటించారు. ఈమేరకు రూ.50 లక్షలు మంజూరు చేసి బుధవారం పనులు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని, పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ చేసిందేమీలేదని అన్నారు. ప్రతీ గ్రామానికి మిషన్ భగీరథ నీరు అందిస్తున్నామన్న బీఆర్ఎస్ నాయకులు ఉపజ్ఞ హోమ్స్‌కు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఉపజ్ఞ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తానన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



విద్యార్థినులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

జమ్మికుంట: మండలంలోని గండ్రపల్లి గ్రామం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికల)లో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కుడిసియ ఆధ్వర్యంలో బుధవారం వైద్య ఆరోగ్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, జీజనల వ్యాధులు, వేసవిలో ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రైడేపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌సీ డాక్టర్ హిమబిందు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ మంజుల, సూపర్‌వైజర్ స్వరూప, ఆరోగ్య సిబ్బంది మణెమ్మ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



గన్నేరువరం: సారలమ్మను తీసుకువస్తున్న భక్తులు



జమ్మికుంటలో కోయ పూజారులు..

గద్దెలపైకి సారలమ్మ

గన్నేరువరం: మండలంలోని గన్నేరువరం, మైలారం గ్రామాల్లో సమ్మక్క, సారలమ్మ జాతరలో భాగంగా విధులు నిర్వహిస్తున్న వలంటీర్లకు భక్తులు సహరించాలని ఎస్సై చందా నరసింహారావు సూచించారు. బుధవారం జాతర ఏర్పాట్లు, బందోబస్తుపై చర్చించారు. మద్యం సేవించి, మొబైల్ చూస్తూ వాహనం నడపొద్దన్నారు. జాతరలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని, పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలను నిలపాలని, చిన్న పిల్లలు, వృద్ధుల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. నింబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కోయపుజారులు, జాతర కమిటీ సభ్యులు డప్పుచప్పులతో బుధవారం సారలమ్మను గద్దెలపైకి చేర్చారు. ప్రాంగణంలో దుకాణా సముదాయాలు వెలిశాయి. భక్తులు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా తగు జాగ్రత్తలు చేపట్టారు.

శంకరపట్నం: మండలంలోని గద్దపాక, అముదాలపల్లి గ్రామాల్లో సారలమ్మ గద్దెకు చేరుకుంది. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఎస్సై లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

హుజూరాబాద్ : పట్టణ శివారులోని రంగనాయకుల గుట్టవద్ద సమ్మక్క–సారలమ్మ జాతర కమిటీని బుధవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు శాలువాతో సన్మానించారు. కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, వైస్ చైర్మన్ గాలిపు నరేష్, కమిటీ సభ్యులు, నాయకులు, తదితరులు ఉన్నారు. జాతర మొదటి రోజు సారలమ్మ దేవాలయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ఊరేగింపుగా గుట్ట వద్దకు తీసుకొని వెళ్లారు. జాతర కమిటీ చైర్మన్ మూగల రాజిరెడ్డి ఇతర డైరెక్టర్లు అధికారులు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది జాతర పరిసరాలను శుభ్రం చేశారు. టౌన్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేశారు.

హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని జూపాకలో సమ్మక్క–సారలమ్మ జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించుకున్నారు. జాతర వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కేశవపురం, మండలంలోని తనుగుల, వావిలాల గ్రామాల్లో సారలమ్మ తల్లి గద్దెకు చేరుకుంది. మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు జాతరను ప్రారంభించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జమ్మికుంట టౌన్ సీఐ వరగంటి రవి బంధోబస్తు నిర్వహించారు. కౌన్సిలర్ పాతకాల రమేష్, డైరెక్టర్ తిరుపతిరావు, లింగారావుతోపాటు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండిలోని హనుమాన్ ఆలయం నుంచి సారలమ్మను పూజారులు, నిర్వాహకులు పట్టణ శివారులోని గద్దెల వద్దకు శోభాయాత్రగా తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజలు ప్రత్యేక పూజలు చేశారు. రాగంపేట, గుమ్లాపూర్, ఆర్నకొండ, తదితర గ్రామాలలో వన దేవతల జాతరను నిర్వాహకులు ప్రారంభించారు.

సైదాపూర్: మండల కేంద్రంలో సమ్మక్క–సారలమ్మలను జాతర నిర్వాహకుల ఆధ్వర్యంలో ఊరేగింపుగా తీసుకెళ్లి ఊరగుట్టపై ఉన్న గద్దెలపై ప్రతిష్ఠించారు.



హుజూరాబాద్: కమిటీ సభ్యులను సన్మానిస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బాబు, నాయకులు

- **వృద్ధుడి ఆత్మహత్య**

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన పప్పు నరసయ్య(90) జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన నరసయ్య కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు పలు ఆసుపత్రిలో వైద్యం చేయించిన ఆరోగ్యం బాగుపడలేదు. దీంతో బుధవారం గ్రామ సమీపంలోని వ్యవసాయబావిలో దూకాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.